# కరీంనగర్ సూర్య



పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

గురువారం 28 డిసెంబర్ 2023 10పేజీలు





# యువత గురి.. సర్పంచ్ గిరి..!

- రంగంలోకి దిగేందుకు అనేక మంది ఆసక్తి
- సామాజిక, సేవా కార్యక్రమాలతో జనంతో మమేకం
- నోటిఫికేషన్ కోసం ఆత్రుతగా ఎదురుచూపులు

**సూర్య కోనరావుపేట**

ఉన్న ఊరు.. కన్నతల్లిలాంటిది. పుట్టిన ఊరు కు ఉపకారం చేయాలని భావిస్తుంటారు. గతంలో సర్పంచ్ పదవుల్లోఎక్కువ మంది 40 ఏండ్లకు పైబడిన వారు మాత్రమే ఉండేవారు.ఎవరైనా యువకులు పోటీ చేయాలని భావించినా.. ఇంకా నీకు సమయం ఉంది.. ఇప్పుడే వద్దు అనే వారు. కానీ ప్రస్తుతం ట్రెండ్ మారింది .గ్రామంలో సర్పంచ్ గిరి చేయాలని యువత ఎంతో ఆసక్తి కనబరుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చాలా గ్రామాల్లో యువత చాలామంది సర్పంచులుగా పదవుల్లో ఉన్నారు. తాజాగా మరింత మంది యువత సైతం ఈ పదవిని అలంకరించేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. సర్పంచులు గా ఎన్నికైతే ఊరికి చేయాల్సిన అభివృద్ధి పై యువత ప్రచారం చేయటంతో జనం వారికి ఆకర్షితులవుతున్నారు. గ్రామ సర్పంచ్ పదవికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది.

2 లో...



# అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యంగా ప్రజా పాలన

- 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు
- నిరుపేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చెందేలా కృషి
- అధికారులు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలి
- ప్రజలకు అసౌకర్యం కల్గకుండా ప్రజాపాలన సభలు నిర్వహించాలి
- బియ్యం రీసైక్లింగ్ పాల్పడే వారి పట్ల అత్యంత కఠిన వైఖరి
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధ వారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరి యంలో రాష్ట్ర నీటిపారుదల, (మిగతా 2లో)

# దివ్యాంగులకు అండగా కేంద్ర ప్రభుత్వం

## - ప్రతి ఒక్కరికి సహాయ ఉపకరణాల అందేలా చూస్తాం
## - కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం సాధికారత కేంద్ర మంత్రిత్వ శాఖ, అలీమ్ కో సహకారంతో వికలాంగులకు ఉచిత సహాయ ఉపకర ణాలను పంపిణి కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు (మిగతా 2లో)






# సింగరేణిలో ముగిసిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

## – 95 శాతం పోలింగ్
## – అర్ధరాత్రి తర్వాత పూర్తిస్థాయి ఫలితాలు

**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ బుధవారం సాయంత్రం ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి పరిధిలోని 11 డివిజన్ లలో ఉదయం 7 గంటలకు ఎన్నికల పోలింగ్ మొదలు కాగా సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఎన్నికల కోసం 84 పోలింగ్ కేంద్రాలు, 11 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 13 కార్మిక సంఘాలు ప్రాతినిధ్యం కోసం తలపడ్డాయి. దక్షిణ భారతదేశంలోనే ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా పేరు గడించిన సింగరేణి కాలరీస్ పరిధిలో 24 భూగర్భ, (మిగతా 2లో)





# యువత గురి.. సర్పంచ్ గిరి...!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామంలోఏ సమావేశం నిర్వహించిన,ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా.. తొలుత సర్పంచులనే సంప్రదిస్తుంటారు. ఈయనే ఆ సమావేశానికి అధ్యక్షత వహిస్తుంటారు. ప్రస్తుతం యువత సైతం రాజకీయాల్లోరాణించాలని భావిస్తున్నారు. ఇందులో రాణించాలంటే మొదట గా సర్పంచ్ పోటీ చేసి గెలిస్తే.. మండల స్థాయిలో తర్వాత జిల్లా స్థాయితో పాటు ఉన్నత పదవులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అనుకుంటున్నారు.ఒకప్పుడు సర్పంచ్ పదవి అంటే యువత అంతగా ఆసక్తి చూపించేవారు కాదు. కానీ మారిన పరిస్థితులు, ప్రభుత్వంనుంచి దండిగా నిధులు వస్తుండటం.. వాటిని గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ అభివృద్ధి చేస్తే మంచి పేరుసంపాదించవచ్చనే ఆలోచనతో అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారని తెలుస్తోంది. ఒక్కొక్కరు ఒక్కో రీతిన ఆలోచన చేస్తూ గ్రామాల్లో మౌళిక వసతలు కల్పన, అభివృద్ధి పనులతో, వారి పల్లెలను స్వయంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. వీరిలో మిగితా యువతలో ఈ పదవిపై ఉత్సాహం పెరిగేందుకు కారణమవుతోంది.

**- సామాజిక సేవ కార్యక్రమాలతో జనంతో మమేకం.!**

అనేక ఏండ్ల నుంచి గ్రామాల అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తున్నారు. యువజన సంఘాలుగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం..శ్రమదానంతో పాటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించడంతో పాటు గ్రామంలో చేపట్టే శుభకార్యాల్లో పాలు పంచుకుంటూకూర్చునేందుకు యువత సైతం ఆసక్తి చూపిస్తోంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో యువతసర్పంచుల పదవుల్లో ఉన్నారు. తాజాగా మరింత మంది యువత సైతం ఈ పదవినిఅలంకరించేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం గ్రామస్తులు సైతం యువతకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నారు. సర్పంచులుగా ఎన్నికైతే ఊరికి చేయాల్సిన ఉపకారంపై యువత వారి ప్రచారం చేస్తుండటం కారణంగా గ్రామస్తులు సైతం వారి పట్ల ఆకర్షితులవు తున్నట్లు తెలుస్తోంది. జనం అభిమానాన్ని సంపాదించుకుంటున్నారు. చాలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ గ్రామస్తుల్లో తల్లో నాలుకగా ఉంటున్నారు. యువకులుల గ్రామస్తుల మద్దతుతో రాజకీయాల్లోనూ రాణించేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ క్రమంలోనే తొలుత సర్పంచ్ కి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో సర్పం చ్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లుచే యడంతో ఇప్పట్నుంచే అనేక మంది వీటిపై కన్నేశాడు. ఇప్పటికే గ్రామాల్లో తాము పోటీలో ఉంటామని పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నారు. కొందరైతే ప్రచారాన్ని సైతం పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

### సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నాను.

**-గంగుల ప్రశాంత్ ,యువకుడు,ధర్మారం**



గ్రామంలో వివిధ రకాల మౌళిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యం తో ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నాను.సర్పంచ్ గా పోటీ చేసి రాజకీయాల్లోనూ రాణించాలని ఉంది. రిజర్వేషన్లు ఎవరికి వస్తాయోనని ఆసక్తిగా చూస్తున్నారు. నోటిఫికేషన్ రావడమే తరువాయి నామినేషన్ చేసేందుకు సిద్ధమవుతుండం ఆసక్తికరంగా మారింది.

### యువత రాజకీయాల్లోకి రావాలి

**- చిట్నేని శివతేజరావు, యువకుడు, కోనరావుపేట**



రాజకీయాలతోనే అందరి జీవితాలు ముడిపడి ఉంటాయి.యువత తీసుకొనే నిర్ణయాలతో జీవితాల్లో వెలుగులుతీసుకురావచ్చు. ముఖ్యంగా యువత ఎక్కువ మంది రాజకీయాల్లోకి వస్తే బాగుంటుంది. ప్రభుత్వాలు నుంచి వచ్చే నిధులు సక్రమంగా సద్వినియోగంచేస్తే గ్రామాల అభివృద్ధి చేయవచ్చు.

# సింగరేణిలో ముగిసిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

**(మొదటి పేజీ తరువాయి)**

18 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో 39,805 మంది కార్మికులకు గాను 37,451 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోగా 95 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. రామగుండం ఏరియా-1 లో 5384 మంది కార్మికులకు గాను 5044 కార్మికులు ఓటు వేయగా ఇక్కడ 93.70 శాతం పోలింగ్ నమోదయింది. అలాగే రామగుండం ఏరియా-2 లో 3556 ముందు కార్మికులకు గాను 3369 మంది కార్మికులు, రామగుండం ఏరియా-3 లో 3884 మంది కార్మికులకు గాను 3612 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్ టియుసి), సిపిఐ పార్టీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మధ్య ఉండగా గతంలో గుర్తింపు కార్మిక సంఘం గా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏఐటియుసికి మద్దతునిచ్చింది. జాతీయ కార్మిక సంఘాలైన బిఎంఎస్, హెచ్ఎంఎస్, సిఐటియు సైతం ఎన్నికల్లో పోటీపడ్డప్పటికీ కార్మికులను తమ వైపు తిప్పుకోవడంలో విఫలమయ్యారని చెప్పుకోవచ్చు. మొత్తం 13 కార్మిక సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీ పడ్డాయి. రాత్రి ఏడు గంటలకు కౌంటింగ్ ప్రారంభం కావడంతో అర్ధరాత్రి 12 గంటల తర్వాత పూర్తిస్థాయిలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా ఏరియా వారీగా విజేతలను ప్రకటించ నుండగా ఆ తదుపరి మొత్తం పోలైన ఓట్లలో సగం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన సంఘానికి గుర్తింపు హోదా కేటాయిస్తారు.

# దివ్యాంగులకు అండగా కేంద్ర ప్రభుత్వం

**(మొదటి పేజీ తరువాయి)**

బండి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హుజురాబాద్, కరీంనగర్ డివిజన్లలో నిర్వహించిన ఎంపిక శిబిరాలలో దివ్యాంగుల వివరాలు సేకరించి వారందరికీ ప్రస్తుతం ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 731 మంది దివ్యాంగులు సహాయ ఉపకరణాలకు ఎంపికయ్యారని. ఈ ఉపకరణాల విలువ 68 లక్షల 28 వేలుగా ఉందని తెలిపారు. వీరందరికీ గతంలోనే సహాయ ఉకరణాలు పంపిణీ చేయాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదా పడిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో పేరు రానివారికి, కొత్తగా దరఖాస్తు చేసే వారి కోసం మళ్లీ అవకాశం ఇస్తామని అన్నారు. ప్రతి వికలాంగుడికి సహాయపడే ప్రతి సహాయ ఉపకరణాన్ని అందజేస్తామని తెలిపారు.మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడిఉందని. మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్, పోషణ్ అభియాన్ వంటి అనేక కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా తల్లి తండ్రి లేని పిల్లలకు ఆర్థిక సాయం కల్పిస్తుందని. మహిళలకు భరోసా తో పాటు పోలీసు, న్యాయ సహాయం కూడా అందజేస్తున్నదని తెలిపారు. ప్రతి పిల్లవాడు పనిలో కాకుండా పాఠశాలలోనే ఉండాలన్న ధ్యేయంతో ముందుకు వెళుతుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు బాలింతలు చిన్నారులకు పోషకాహారం అందించడంలోనూ కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిడిపిఓ భాగ్యలక్ష్మి, ఏసిడిపిఓలు సౌందర్య, అరవింద, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అలింకో సిబ్బంది రవిశంకర్, అంకిత్ రాయ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# రగ్బీ క్రీడలో ఎంజెపి విద్యార్థుల ప్రతిభ

**సూర్య, హుజురాబాద్**

ఇటీవల సికింద్రాబాద్ లో ఆర్.ఆర్.సి సి సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో డిసెంబర్ 23, 24 తేదీల్లో నిర్వహించిన స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా రగ్బీ లీగ్ ఉమెన్స్ ఖేలో ఎంజెపి గురుకుల పాఠశాల హుజురాబాద్ కు చెందిన విద్యార్థినీలు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన రగ్బీ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాఠశాలకు చెందిన 8, 9,10 తరగతుల విద్యార్థినీలు పోటీలో పాల్గొని జట్టు తృతీయ స్థానం సాధించారని ఎంజెపి ప్రిన్సిపల్ వి. మీనాక్షి తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతి పొంది పాఠశాల కీర్తిని పెంచిన విద్యార్థినిలను బుధవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఈటి చిరుత, కవిత, రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ రంగు నిరంజన్ పాల్గొన్నారు.



### అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీల

# అమలే లక్ష్యంగా ప్రజాపాలన

**(మొదటి పేజీ తరువాయి)**

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ లతో కలిసి ప్రజాపాలన గ్రామ,వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు రాష్ట్రంలోని ప్రజల స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రి అన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.గ్రామంలో నిర్వహించే ప్రజాపాలన సభ ముగిసిన తరువాత కూడా ప్రజలు పంచాయతీ కార్యాలయంలో జనవరి 6 వరకు తమ దరఖాస్తు సమర్పించే అవకాశం ఉందని,ఈ మేరకు సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు మార్గదర్శకాలు జారీ చేయాలని మంత్రి ఉన్నతాధికారులకు ఆదేశించారు.

ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరించే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు జత చేయాలని, రేషన్ కార్డు లేకపోయినా దరఖాస్తులు స్వీకరించాలని ప్రస్తుతం సేకరించిన దరఖాస్తుల పరిశీలించి, నూతన రేషన్ కార్డుల జారీ పై త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ఎటువంటి సందేహాలు ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని, ప్రజా పాలన సమయంలో అధికారులు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని వారికి వచ్చే అన్ని సందేహాలను నివృత్తి చేయాలని మంత్రి తెలిపారు.ప్రజలు ఎన్నుకున్న నూతన ప్రభుత్వంలో అవినీతికి ఎలాంటి ఆస్కారం ఉండదని, ప్రభుత్వ పథకాలు అర్హులకు అవినీతికి తావు లేకుండా అమలు జరగాలని, అధికారులు పూర్తి పారదర్శకంగా అవినీతి రహితంగా విధులు నిర్వహించాలని మంత్రి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నీటిపారుదల శాఖ ప్రాజెక్ట్ ల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు.మంథనిలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, హుస్నాబాద్ లోని గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిరుపేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చెందేలా కృషి చేయడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేశామని , ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేసే కార్యాచరణ ప్రభుత్వం ప్రారంభించిందని, అర్హులందరికీ పథకాలు వర్తింప చేసేందుకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు పని దినాలలో ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రజాప్రాలన గ్రామసభల సమయంలో ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తుల తో పాటు ప్రజలు తమకు ఉన్న ఇతర సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తే వాటిని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేకరించి పరిశీలించాలని, జిల్లా యంత్రాంగం పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రజా పాలన కార్యక్రమానికి వచ్చిన ఏ ఒక్క దరఖాస్తు తిరస్కరించ వద్దని మంత్రి అన్నారు.

రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ పాలనలో మార్పు కావాలని ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిందని, మార్పు కావాలని ఆకాంక్షించిన వారిలో ప్రభుత్వ ఉద్యోగుల సైతం అధిక సంఖ్యలో ఉన్నారని, ప్రజలు ఆకర్షించిన మార్పును వారికి అందించే దిశగా, పేదవాడి ముఖంలో చిరునవ్వు వచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజా పాలన కార్యక్రమానికి వచ్చే దరఖాస్తు దారులను చిరునవ్వుతో స్వాగతించాలని, ప్రతి కేంద్రంలో నిర్లక్ష్యరాస్యుల కోసం సహయకులను ఏర్పాటు చేయాలని, దరఖాస్తుల స్వీకరణ సజావుగా జరిగే విధంగా పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష ,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ రావు, డాక్టర్ సంజయ్ కుమార్, చింతకుంట విజయరమణా రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, పోలీసు ఉన్నతాధికారులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని తహసిల్దార్లు, ఎంపీడీవోలు మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులకు ఆహ్వానం

## - 6 గ్యారంటీల అమలులో ఎలాంటి అవకతవకలు జరగవు - ఎంపీడీవో కల్పన

**సూర్య, జమ్మికుంట రూరల్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలకు జమ్మికుంట మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 28 నుండి వచ్చేనెల 6 వరకు ప్రకటించిన తేదీల షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జమ్మికుంట మండల ఎంపీడీవో కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సాధికారత ద్వారా సామాజిక న్యాయం కోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రజా వాణి నిర్వహించేందుకు ముఖ్యమంత్రి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారని ఆమె తెలిపారు. ప్రజా పాలనలో భాగంగా పాలనను గ్రామస్థాయికి తీసుకెళ్లి పేద, బడుగు, బలహీన వర్గాలకు సుపరిపాలన ఫలాలను పంచేందుకు వీలుగా 28 నుండి వచ్చే నెల 6 వరకు గ్రామ సభలు నిర్వహించి 1. మహాలక్ష్మి, 2. రైతు భరోసా, 3. గృహజ్యోతి పథకం, 4. ఇందిరమ్మ ఇళ్ల పథకం, 5. చేయూత పథకం కొరకు ప్రజల నుండి ధరఖాస్తులు స్వీకరించుటకు జిల్లా కలెక్టర్ ఆదేశించినారని ఆమె పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం జమ్మికుంట మండల పరిధిలోని గ్రామ



పంచాయితీలలో ఈనెల 28న అంకుషాపూర్, బిజిగిరి షరీఫ్, గంగ్రపల్లి, జగ్గయ్యపల్లి, 29న మాచనపల్లి, మడిపల్లి, నాగారం, 30న నాగంపేట, నగురం, పాపయ్యపల్లి, పాపక్కపల్లి, వచ్చేనెల జనవరి 2న పెద్దంపల్లి, సైదాబాద్, శంభునిపల్లి, శాయంపేట, 3న తనుగుల, వావిలాల, వెంకటేశ్వర్లపల్లి, విలాసాగర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుండి ధరఖాస్తులు స్వీకరించబడునని ఎంపీడీవో తెలిపారు. కావున ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యునిగా తిమ్మాపూర్ మండల నివాసి బొంతల కళ్యాణ్ చంద్ర

**- నియామకపు ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు**

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**



కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డులో తిమ్మాపూర్ మండలం అలుగునూర్ (శ్రీ వెంకటేశ్వర కాలనీ) నివాసి బొంతల కళ్యాణ్ చంద్రకు అవకాశం లభించింది. బోర్డు అడ్వైజరీ ప్యానల్ మెంబర్ నియమిస్తూ బుధవారం ఆ బోర్డు హైదరాబాద్ రీజినల్ అధికారి శిఫాలి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు బోర్డు సభ్యునిగా కళ్యాణ్ చంద్ర కొనసాగుతారనీ నియామకపు ఉత్తర్వులో పేర్కొన్నారు. లోగడ ఈనాడు ప్రధాన పత్రికలో పట్టణ, క్రైమ్ రిపోర్టర్ గా కళ్యాణ్ చంద్ర పనిచేశారు. అనంతరం లోక్ శక్తి పక్షపత్రిక ను కరీంనగర్ జిల్లా కేంద్రంగా ప్రారంభించారు. పత్రికా ఎడిటర్ గా, ఇండిపెండెంట్ జర్నలిస్టుగా రెండు దశాబ్దాలు గా జర్నలిజం రంగంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం బిజెపి జిల్లా అధికార ప్రతినిధిగా బొంతల కళ్యాణ్ చంద్ర కొనసాగుతున్నారు. కేంద్ర సెన్సార్ బోర్డు మెంబర్ గా తనకు అవకాశం కల్పించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, బిజెపి నాయకత్వానికి బొంతల కళ్యాణ్ చంద్ర ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజా పాలనను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**సూర్య, వీణవంక**



కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమన్వయ కర్తలుగా వ్యవవహరించాలని వీణవంక మండల పార్టీ అధ్యక్షులు చింతల శ్యామ్ సుందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28 తేదీ నుండి ప్రతిష్టత్మాకంగా నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమంలో 06 గ్యారంటీల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేలా వీణవంక మండలంలో గల 26 గ్రామపంచాయతీలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమంను విజయయవంతం అయ్యేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

## రైతే దేశానికి వెన్నెముక

**- అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతు లకు సన్మానం**

**సూర్య, హుజురాబాద్**



దేశానికి రైతే వెన్నెముకని, రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు శ్రమించి పనిచేస్తేనే దేశం బాగుం డుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవా రం హుజురాబాద్ పట్టణంలో జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ రైతులను అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రైతు లావాపేక్ష లేకుండా పనిచేస్తూ దేశాన్ని బతికిస్తున్నాడని అన్నారు. రైతు శ్రమను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగులో నూతన మెలకువలను ఉపయోగించాలని, నూతన యాజమాన్య పద్ధతులను పాటించాలని అన్నారు. వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధిస్తున్న ఉత్తమ రైతులు వర్ధిల్లి అన్నారావు, సొల్లు సునీత, నర్ర తనూజ, గూడూరి మల్లారెడ్డి, ముచ్చె పుల్లారెడ్డి లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎస్ఐ సాంబయ్య, ఏఈఓ సతీశ్ రెడ్డి, అలయన్స్ క్లబ్ అధ్యక్షులు బత్తుల మనోజ్, ఉపాధ్యక్షుడు తూము వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టీ. మాధవ రావు, కోశాధికారి బి. సంపత్ రెడ్డి, సభ్యులు టి. సంపత్ రావు, వైద్యులు తొగరు విద్యాసాగర్, ఆర్కె, మెడికల్ కన్నయ్య, ఏ టూ జెడ్ మెడికల్ నాగరాజు లతో పాటు ఎమ్. గౌరి శంకర్, ఆర్. తిరుపతి రెడ్డి, శ్రీహరి, సొల్లు బాబు, పసుల స్వామి, ఎస్. ఐలయ్య, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంగారంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

**సూర్య, వీణవంక**



దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామాల్లో అందరికీ తెలియజేసే గురించి వికసిత భారత్ సంకల్ప యాత్ర అనే కార్యక్రమాన్ని రూపొందించారని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గంగారం గ్రామంలో అన్ని శాఖల అధికారులు, స్థానిక వైద్య సిబ్బంది బృందం గ్రామ పాలకవర్గం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తుందని, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనని, ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, అర్హులైన వారందరూ కేంద్ర పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ జాతీయ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రం ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఏయే కార్యక్రమాలు చేస్తోంది...? ఏయే పథకాలను అమలు చేస్తున్నారనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' పేరుతో ప్రచార రథాలు ఊరూరా తిరుగుతున్నాయన్నారు. ఈ యాత్ర సందర్భంగా వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. అర్హులైన వారంతా ఆయా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఇట్టి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పేద ప్రజలకు అవసరమైన సౌకర్యాలకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘు, జిల్లా ఉపాధ్యక్షులు సంపత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహరాజు, అసెంబ్లీ కన్వీనర్ గౌతమ్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి, మల్లారెడ్డి, సదానందం, రమేష్, రవీందర్, సమ్మయ్య, కుమారస్వామి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు ప్రత్యేక అధికారుల కేటాయింపు

**సూర్య, హుజురాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఈనెల 28 నుండి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమానికి ప్రత్యేక అధికారులను జిల్లా ఉన్నతాధికారులు నిర్మించారు. హుజురాబాద్ నియోజకవర్గం స్థాయి ప్రత్యేక అధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జునను నియమించింది. హుజురాబాద్ మున్సిపల్ పరిధి ప్రత్యేక అధికారిగా డిఎంఓ పద్మావతి ని, జమ్మికుంట మున్సిపల్ పరిధి ప్రత్యేక అధికారిగా డిఇఓ జనార్దన్ రావు ను నియమించారు. కాగా మండల వారీగా హుజురాబాద్ మండలానికి ఎంప్లాయిమెంట్ అధికారి కే. దేవేందర్ రావును, జమ్మికుంట మండలానికి పరిశ్రమల శాఖ జిఎం నవీన్ కుమార్ ను, వీణవంక మండలానికి చీఫ్ ప్లానింగ్ అధికారి డి. కొమురయ్యను, ఇల్లందకుంట మండలానికి హార్టికల్చర్ జిల్లా అధికారి బి. శ్రీనివాస్ ను ప్రభుత్వం నియమించింది. ఈ అధికారులు తమ పరిధిలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు.

## ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోండి

**సూర్య, హుజురాబాద్**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య కోరారు. ఈనెల 25వ తేదీ గురువారం మున్సిపల్ పరిధిలో 1వ వార్డు ప్రజలు కొత్తపల్లి హనుమాన్ గుడి వద్ద, 2వ వార్డు ప్రజలు మామిండ్లవాడలోని ఉర్దూ భవన్ స్కూల్ వద్ద, 3వ వార్డు ప్రజలు కుమ్మరివాడ చౌరస్తా వద్ద, 4వ వార్డు ప్రజలు ప్రతాపవాడ లోని తొర్రి లింగయ్య ఇంటి సమీపములో నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమం దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

## తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు

**సూర్య, జమ్మికుంట రూరల్:**



జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ముంజాల తిరుపతి (56) అనే గీత కార్మికుడు ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన తోటి గీత కార్మికులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం 108 ద్వారా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముంజాల తిరుపతి కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ కోరారు. అదే విధంగా నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా సేఫ్టీ మోకులు అందించాలని కోరారు. కాగా ఈ పది రోజుల వ్యవధిలో జమ్మికుంట మండలంలో ఇద్దరు గీత కార్మికులు తాటి చెట్టు పైనుండి పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రస్తుతం వీరు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు.



## శాస్త్రీయ అవగాహన పెరిగితే మూఢ నమ్మకాలు దూరం

**సూర్య, హుజురాబాద్**

విద్యాలయాల్లో విద్యార్థులు చదువుకునే సమయంలో శాస్త్రీయ అవగాహన పెరగడం వల్ల మూఢనమ్మకాలు దూరం అవుతాయని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం మ్యాజిక్ అధ్యాపకులు ఈ. చంద్రయ్య అన్నారు. బుధవారం హుజురాబాద్ పట్టణ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ అవగాహన కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైన్స్ ప్రాముఖ్యత చాలా ఉందని, అందుకు ప్రతి ఒక్కరు సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. శాస్త్రీయ అవగాహన ఉన్న బాలల తో ఆధునిక భారతాన్ని నిర్మించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పలు సైన్స్ అంశాలను మ్యాజిక్ లను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గడల శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ నరేష్, మానవికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య, పెరుక సుందరయ్య, కలకోటి వెంకటేష్, సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, సుమలత, శ్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణం పై అవగాహన కార్యక్రమం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలో బుధవారం పర్యావరణ నెట్ వర్క్, స్పందన సేవ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు పర్యావరణం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, వాటిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అప్పుడే ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని అన్నారు. ప్లాస్టిక్ బదులు బట్ట సంచులు వాడాలని, పిల్లలకు ప్లాస్టిక్ టిఫిన్ ల బదులుగా స్టీల్ టిఫిన్ లను ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన సేవా సొసైటీ సభ్యులు సాధన, పొలవేణి గౌతమి, సుజాత, మహిళా సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ రెడ్డి కి డిప్యూటీ సివిల్ సర్జన్ గా పదోన్నతి

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ గా పనిచేస్తున్న పి. శ్రీకాంత్ రెడ్డి కి డిప్యూటీ సివిల్ సర్జన్ గా పదోన్నతి కల్పిస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యునిగా పని చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ వందలాది శస్త్ర చికిత్సలు చేసి ఈ ప్రాంత ప్రజలకు అభిమాన డాక్టర్ గా మారాడు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన వల్ల బెడ్స్ ఫుల్ అని బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది. శ్రీకాంత్ రెడ్డి చేస్తున్న శస్త్ర చికిత్సల వల్ల హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, సిద్దిపేట్, భూపాలపల్లి తదితర జిల్లాల నుండి కూడా ఆపరేషన్ల కోసం ప్రభుత్వాసుపత్రికి రావడం విశేషం. శ్రీకాంత్ రెడ్డి కి పదోన్నతి రావడం పట్ల పలువురు విద్యాభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి ఒక్కరూ బీమా భద్రతను పొందండి..

**- లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి- "అర్పపల్లిలో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర"**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

సారంగపూర్ మండలం అర్పపల్లి గ్రామంలో బుధవారం వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిధి లోని అన్ని బ్యాంకుల యొక్క బ్రాంచిల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు పరుస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సామాజిక భీమా భద్రత పథకాలైన ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, సురక్షా భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకం కింద నమోదు చేసుకోవాలని సూచించారు. పది సంవత్సరాల లోపు



ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన మంచి పథకమని వ్యాపారం చేసే ఆసక్తి ఉన్న వారి కోసం ముద్ర, స్టాండప్ ఇండియా, పిఎం ఈజీపి వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధి లోకి రావాలని కోరారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆరోగ్య సమస్యలు పరిష్కారం చూపించడమే కాకుండా, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వాటిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండ శ్రీలత, ఉప సర్పంచి తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్ సుభాష్, ఎఫ్ఎల్సీ మధు సూదన్, అంగన్వాడీ సూపర్ వైజర్ లత, తపాలా శాఖ అధికారి శ్రీనివాస్, సిఏలు శ్రీలత, నర్మదతో పాటు అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా, రైతు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్ ను కలిసిన బీసీ సంఘం నాయకులు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్ ను బుధవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆది శ్రీనివాస్ నివాసంలో ఆయనను కలిసిన లక్ష్మీనారాయణ శాలువాతో విప్ శ్రీనివాసును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ పలు బీసీ సమస్యల గురించి విప్ తో చర్చించారు.



## మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

**సూర్య జగిత్యాల**

మహిళ స్వశక్తి సంఘాల సభ్యులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందా లని నాబార్డు డి.డి.యం మనోహర్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామంలో హైదరాబాద్ కి చెందిన స్పందన ఎన్. జి.ఓ, నాబార్డు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్ లో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ స్వశక్తి సంఘాల సభ్యులకు స్పందన సొసైటి వారు ముందుకు రావడం సంతోషదాయకమని, నాబార్డు కూడా ఇందుకు సహకారాన్ని అందివ్వడం జరుగుతుందని అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ వారి సహకారాన్ని తీసుకొని ఇట్టి కార్యక్రమాలను చేయడం జరుగుతుందని అన్నారు. స్పందన సంస్థ ఆర్గనైజర్ శోభారాణి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో గ్రామీణ మహిళల అభివృద్ధి కోసం వివిధ రకాల ఉచిత శిక్షణ లు ఇవ్వడం జరుగుతుందని,శిక్షణ కాలం 15 రోజులు ఉంటుందని,శిక్షణ సమయంలో భోజన%శీ%, గౌరవ భత్యం తో పాటు శిక్షణ పూర్తి అయ్యాక నాబార్డు వారి ధ్రువీకరణ పత్రం అందజేయడం జరుగుతుందని అన్నారు. టి.లైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల. శిరీష రెడ్డి, సర్పంచ్ సంధ్యా రాణి శ్రీనివాస్, ఎంపీటీసీ సౌజన్య తిరుపతి,ఉప సర్పంచ్ సునీత నరేష్,ఎపియం వోడెల గంగాధర్, సి.సి.బి.రవిందర్,వి.ఓ.ఏ లు రమ, జయ,కవిత, చంద్రకళ, అధ్యక్షురాలు జ్యోతి తో పాటు 30 మంది శిక్షణ తీసుకునే మహిళలు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా అయోధ్య శ్రీరామ అక్షింతల ఎదుర్కోలు

**- కరసేవకులకు ఘన సన్మానం**

**సూర్య,రాయికల్**

అయోధ్య తీర్థ క్షేత్ర సమితి ఆధ్వర్యంలో అయోధ్య నుండి వచ్చిన అక్షింతల ఎదుర్కోలు కార్యక్రమం మండలంలోని రామాజీపేట్ గ్రామం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుండి శ్రీ సీత రామాలయం వరకు ఘనంగా డప్పుచప్పుల్లతో,మహిళా మూర్తుల మంగళహారతులతో,జై శ్రీరామ్ నినాదాలతో శ్రీరామ తీర్థ క్షేత్ర సమితి రామాజీపేట్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఎదుర్కొన్నారు. శ్రీరామ జయ రామ జయజయ రామ నామ మంత్రాన్ని జపించి హనుమాన్ చాలీసా పారాయణము చేసారు.ఈ సందర్భంగా శ్రీ రామ తీర్థ క్షేత్ర సమితి వారు మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి వేలాది మంది కరసేవకులు,రామభక్తులు ప్రాణత్యాగం చేసారని, ఎనలేని పోరాటం చేసారని వారందరి త్యాగ ఫలితమే ఈ భవ్యదివ్య మందిర నిర్మాణమని అన్నారు. 450 యాభై సంవత్సరాలకు పైగా నానిన సమస్య సుప్రీం కోర్టు ద్వారా పరిష్కారమై హిందువుల కల సాకారమవుతున్న తరుణం వర్ణింపరానిదని,ఈ భవ్యమైన పండుగ వర్తమానంలో మన కళ్ళముందర సాకారం కావడం సనాతన ధర్మ విజయమని ఇది మన కళ్ళతో చూడటం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు.ఈ మహత్తర కార్యసాధనకై 1990 అక్టోబర్ లో1992 డిసెంబర్ లో ఉమ్మడి కరీనగర్ జిల్లా లోనే అత్యధికంగా 17 మంది కరసేవకులుగా పోవడం,పంపడం మన గ్రామానికి గర్వకారణమని అన్నారు.అనంతరం కరసేవకులకు ఓం, జై శ్రీరామ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.భక్తులకు దాతలు ప్రసాద వితరణ చేసారు.దేవుడి తీర్థ తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తులు తరించారు. ఈ కార్యక్రమంలో 250 మంది గ్రామప్రజలు, శ్రీరామ భక్తులు,శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి విరాళం

**సూర్య జగిత్యాల**



జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ప్రాథమిక పాఠశాల లో చదువుకొని విదేశాల్లో స్థిరపడ్డ బేతి గోపాల్ రెడ్డి , గంగ భవాని గతంలో రూపాయలు 200000 విలువగల టాయ్లెట్ నిర్మాణం, ఎడమల కృష్ణ రెడ్డి వాటర్ ప్యూరిఫైర్ రూ. 20000 విలువగలది విరాళంగా ఇచ్చారు. అట్లాగే బుధవారం సుమారుగా రూపాయలు 30000 విలువ గల స్పోర్ట్స్ డ్రెసేస్ , టై బెల్ట్, ఐ డి కార్డ్స్, రూ 50000 విలువగల వెబ్ సీసీ కెమెరాలు విరాళంగా ఇవ్వడం జరిగినది. వీరికి రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , విద్యార్థులు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోల్లే సత్తమ్మ గంగారాం, జగిత్యాల సహకార సంఘం అధ్యక్షులు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, ఎంపిటిసి భుమరెడ్డి ,ఉపసర్పంచ్ రామ్మోహన్, గంగాధర్, దేవయ్య, కొక్కుల గణేష్, పీజీ హెచ్ ఎం బన్న, హెచ్ ఎం పి శ్రీనివాస మూర్తి, బి కిరణ్, కే రఘునందన్, పి సుగుణ, రాజు, రాజశేఖర్, అంజి బాబు, పద్మ, గీతదేవి, షాహిన్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా గట్టు మల్లన్న జాతర

**సూర్య జగిత్యాల**

జగిత్యాల రూరల్ మండలం లోని వెల్దుర్తి గ్రామంలో గల మల్లన్న గుట్ట పై గట్టు మల్లన్న జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పరిసర ప్రాంతాల నుండి భారీ గా తరలివచ్చి బోనాలు సమర్పించి, మల్లన్నకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## గల్ఫ్ హామీలు అమలు చేయాలి

**- 'ప్రజాపాలన' దరఖాస్తుల్లో గల్ఫ్ మృతుల నమోదు అంశాన్ని చేర్చాలి..**

**- ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి..**

**సూర్య జగిత్యాల ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా... 'అభయ హస్తం మేనిఫెస్టో' లో 'గల్ఫ్ కార్మికులు ఎన్నారైల సంక్షేమం' , మరణించిన గల్ఫ్ కార్మికుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు చేస్తామన్న ఇతర నాలుగు హామీలను వెంటనే అమలు చేయాలని ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు పది రోజుల పాటు 'ప్రజాపాలన' నిర్వహించి గ్రామ సభలు, పట్టణాలలో వార్డు సభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో గల్ఫ్ మృతుల కుటుంబాలు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా కొరకు 'ప్రజాపాలన' లో దరఖాస్తులు ఇవ్వాలని గల్ఫ్ జెఏసి పిలుపు ఇచ్చిందని భీంరెడ్డి తెలిపారు. ఎన్నారైలకు సంక్షేమ బోర్డు, గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు, టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేస్తామని గల్ఫ్ ఎన్నారైలకు కాంగ్రెస్ ఇచ్చిన నాలుగు హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**సూర్య జగిత్యాల**

జగిత్యాల రూరల్ మండలం లోని హబ్సిపూర్ గ్రామానికి చెందిన ఇటీవలే కారు ప్రమాదం లో మరణించిన ఇమ్మడి మహేష్ కుటుంబానికి రూ. 20 వేలు, అలాగే పలు అనారోగ్య కారణాలతో భాధపడుతున్న నలుగురు దళితుల కుటుంబాలకు రూ. 30 వేలు ఆర్థిక సాయాన్ని కౌన్సిలర్ ముస్కు నారాయణరెడ్డి వారి స్వగృహం హబ్సిపూర్ లో బుధవారం అందజేశారు. అలాగే జగిత్యాల క్లబ్ నుండి రోడ్డు ప్రమాదం లో మరణించిన మహేష్ కుటుంబానికి రూ. 10 వేలు, ముస్కు పద్మ రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, మోహన్ రెడ్డి, నెరేళ్ల శ్రీను, భీమయ్య, ఇమ్మడి రాజేందర్, క్లబ్ మెంబర్లు నారాయణరెడ్డి, పులి రాము, దయాల శంకర్, తదితరులు ఉన్నారు.



## వాలీ బాల్ కిట్, టీ షర్ట్స్ పంపిణీ

**సూర్య జగిత్యాల**

సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన యువకుడు చెకుట శేఖర్ వాలీ బాల్ క్రీడాకారులకు బుధవారం వాలీ బాల్ కిట్, టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ ను గ్రామస్తులు అభినందించారు.కాగా గతంలో సైతం ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ,తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నాడు.



# విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి విద్య అందించడంతో పాటు వారి మానసిక, శారీరక ఎదుగుదల జరిగేలా చూడాలని, విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఎలిగేడు మండలంలోని సుల్తాన్ పూర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి కిచెన్ గార్డెన్ పరిశీలించి పాఠశాల పనితీరుపై ఉపాధ్యాయులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ముచ్చటిస్తూ మనకు అందుబాటులో ఉన్న అంతర్జాలం వినియోగించి సమాజంలో వస్తున్న మార్పులు, మార్కెట్ లో వస్తున్న కొత్త టెక్నాలజీ, నూతన ఉపాధి రంగాలు మొదలగు అంశాలను విద్యార్థులు తెలుసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థు లకు అందిస్తున్న పౌష్టికాహారం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, ఉన్నతి కార్యక్రమం, లక్ష్యం కార్యక్రమం అమలు



గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థుల సమగ్రాభివృద్ధికి మనం బాధ్యత తీసుకోవాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు.

పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా బోధన చేపట్టాలని, ప్రతి ఉపాధ్యాయుడు బోధించాల్సిన పాఠ్యాంశాలపై వార్షిక, నెలవారి ప్రణాళిక తయారు చేసుకుని టి.ఎల్.ఎం ప్రకారం కట్టుదిట్టంగా బోధన చేయాలని అన్నారు. విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన చేస్తూ వారికి పాఠ్యాంశంలోని సారాంశం అర్థమయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించే పేరెంట్, టీచర్స్ సమావేశంలో పాఠశాలలో జరిగే విద్యాబోధనపై డెమోనిర్వహించాలని, ఇంటి వద్ద పిల్లలు కొంత సమయం చదువుపై దృష్టి సారించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాల్సిన అంశాన్ని వివరించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల విద్యార్థులను త్వరలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సందర్శన కోసం తీసుకొని రావాలని, జిల్లా యంత్రాంగం పని చేసే తీరు ను పరిశీలించి కొంత సమయం ఆహ్లాదకరంగా గడుపుతారని, దానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, సంబంధిత అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా ఎల్లమ్మ బోనాలు, కొలువు మహోత్సవ వేడుకలు

### - పాల్గొన్న ఎమ్మెల్యే

**సూర్య-పెద్దపల్లిరూరల్**

పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు, కొలుపు మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ళు, పంబాల పూజారులు డోలు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ కు బోనాలు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు . ఎమ్మెల్యేను సర్పంచ్ ఆడపు వెంకటేశం తో పాటు గౌడ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, ఎంపీటీసీ తోట శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు దూలం సతీష్, ఉపాధ్యక్షుడు వెలిచాల ఆంజనేయులు, గౌడ సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం

**సూర్య-గోదావరిఖని:**



జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బుధవారం బహుమతుల ను అందజేశారు. సిఆర్ఓ ఇండియా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తౌటం చేతన సోని ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డిఆర్డిఏ అధికారిని సునీత చేతుల మీదుగా విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలు , వారి హక్కులు, బాధ్యతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారులు ఏ విధంగా నష్టపోతున్నారు అనే విషయాలను వివరించారు. సిఆర్ఓ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్ కుంట మాట్లాడుతూ వినియోగదారుడు మోసపోతే ఎక్కడ కంప్లైంట్ ఇవ్వాలి అనే విషయాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఇంకా ఈ సమావేశంలో డిటి శంకర్, ఎన్పీడీసీఎల్ అధికారి సుగుణయ్య, బిఎస్ఎన్ఎల్ అధికారులు మహేందర్, రమేష్, సిఆర్ఓ ఇండియా రాష్ట్ర రాజన్న సిరిసిల్ల జోనల్ ప్రెసిడెంట్ కోటేష్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, కోశాధికారి రాజయ్య, పెద్దపెల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్, యూత్ వింగ్ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి ముఖేష్, ఉమెన్ వింగ్ ప్రధాన కార్యదర్శి రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మీరాజం, సిరిపురం శ్రీనివాస్, విద్య పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం లో గురువారం నుంచి ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ మాట్లాడుతూ గురువారం నుంచి 06-01-2024 వరకు 8 రోజుల వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువైన నెల రోజుల లోపునే 'అభయహస్తం' ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మరియు ఇతర మంత్రివర్గ సహచరుల చేతుల మీదుగా గురువారం 'ప్రజాపాలన' కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాల లబ్ధి కొరకు ఈ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వివిధ తేదీల్లో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. గురువారం బుధవారంపేట, సుందిళ్ల, 29వ తేదీన నాగేపల్లి, చందనాపూర్, 30వ తేదీన రత్నాపూర్, వెంకట్రావుపల్లి, జనవరి-02 వ తేదీన పన్నూర్, బేగంపేట, 03వ తేదీన లద్నాపూర్, లొంకకేసరం, కల్వచర్ల, 04 వ తేదీన ఆదివారం పేట, ముస్త్యాల, 05 వ తేదీన రాజాపూర్, జల్లారం, 06 వ తేదీన నవాబుపేట, పెద్దంపేట గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ ఇనుముల రమేష్, తహసీల్దార్ బోర్కర్ రాంచందర్, ఎంపివో కాటం భాస్కర్, వ్యవసాయాధికారి భూక్యా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు అందజేత

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన సెంట్రింగ్ పని చేసే కార్మికులకు ఉచిత లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి తన సొంత ఖర్చులతో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలువేరు స్వామి మాట్లాడుతూ అవగాహన లేక చాలా మంది కార్మికులు ఈ లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు మరియు ఆరు లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తాయన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.

**సూర్య ఓదెల**



ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు బుధవారం రోజు గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్ ఆర్ జి ఎస్ నిధులు 20 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన చేసిన ఆయన, ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా నిర్మించిన సి సి రోడ్డు ను ప్రారంభించారు. గ్రామపంచాయతీ భవన శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే విజయ రమణారావు ను సర్పంచ్ పిట్టల సరిత రవికుమార్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ దుకాణం , పాల కేంద్రానికి భవన నిర్మాణం గురించి తదితర అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రామారావు సానుకూలంగా స్పందించారు. ఈనెల 28వ తేదీ నుండి ప్రారంభం కానున్న ప్రజాపాలన గురించి ప్రజలకు వివరించి అర్హులైన పేదలు ఆరు గ్యారెంటీ లకు సంబంధించిన రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు ,గృహలక్ష్మి, గృహ జ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల సరిత రవికుమార్, ఉపసర్పంచ్ సరోజ ,వార్డు మెంబర్లు యాదగిరి, స్వామి, సరిత, గ్రామ శాఖ అధ్యక్షులు కందుల అశోక్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూడూరు మండల సాధన జెఏసి కన్వీనర్ గా బండ రవీందర్ రెడ్డి

### - యూత్ కన్వీనర్ గా రాజశేఖర్

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని పూడూరు లో బుధవారం రోజున పూడూరు మండల సాధన జెఏసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పది గ్రామాల ప్రజలు పాల్గొని పూడూరు మండల సాధన జెఏసి ని ఏర్పాటు చేసుకున్నారు.మండల సాధన జెఏసి కన్వీనర్ గా గౌరాపూర్ గ్రామానికి చెందిన పూడూరు సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్ రెడ్డి ని అన్ని గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కన్వీనర్ గా నమిలికొండ గ్రామానికి చెందిన కూనవేని రాజశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండ రవీందర్ రెడ్డి, కూనవేని రాజశేఖర్ లు మాట్లాడుతూ పూడూరు మండల సాధన కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తామని అన్నారు. పది గ్రామాల ప్రజలను ప్రజాప్రతినిధులను యువకులను కలుపుకొని పూడూరు కేంద్రంగా నూతన మండలం ను ఏర్పాటు చేసుకునే దాకా కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా పని చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినధులు,నాయకులు యువకులు,తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా మహాగణపతి హెూమం

### - పాల్గొన్న ఎమ్మెల్యే విజయ రమణారావు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

అయ్యప్ప దీక్షాపరుల భజనల మధ్య పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో మహా గణపతి హెూమం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునుండే ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోత్సవాల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహా గణపతి హెూమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఆది గణపతి ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. అయ్యప్ప దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన గుట్ట

**సూర్య, కోరుట్ల టౌన్**

కేరళ రాష్ట్రంలోని శబరిమలలో జరిగే మండల పూజను పురస్కరించుకొని పట్టణంలోని అయ్యప్పగుట్టపై గల జ్ఞాన సరస్వతి మాత, శనైశ్చర, అయ్యప్ప దేవాలయాలలో ఘనంగా జాతర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వంగా సుందరంగా అలకరించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికీ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అష్టాదశ మహా కళశ, పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో గుట్ట మారుమోగిపోయింది ప్రతి ఏట జరిగే ఈ జాతరకు కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, మెట్పల్లి, రాయికల్ మండలాల నుంచి భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దాదాపు 70 వేల నుండి 80వేల మంది భక్తులు హాజరయ్యారు. జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ చేసారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానాన్ని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ జాతరకు ఎంపీ ధర్మపురి అరవింద్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావులు, బిజెపి రాష్ట్ర నాయకులు సురభి నవీన్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో శాశ్వత గౌరవ అధ్యక్షులు చిద్రాల నారాయణ, అడక్ కమిటీ సభ్యులు గంగ్ర అజేందర్ రావు, గంగ్ర రాజేందర్ రావు, అంబటి శ్రీనివాస్, బట్టు హరికృష్ణ, గడ్డం మధు, గురుస్వాములు దగ్గుల నర్సయ్య, గట్ల ఆనంద్ అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.





# ఆరు సంక్షేమ పథకాలతో పేదలకు ప్రయోజనం

**- కాంగ్రెస్ ఇంచార్జీ ప్రణవ్ బాబు**

**సూర్య, హుజురాబాద్**



రాష్ట్రంలోని పేద ప్రజలకు ప్రయోజనం కలిగించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలు అందని వారికి ఉపయోగం కలుగుతుందని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాపాలన ద్వారా ఎక్కువ మంది లబ్ధి పొందేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలని కోరారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలంలోని గ్రామాలతో పాటు హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 60 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ప్రజలు ఈ పథకాల ద్వారా లబ్ధి పొందేలా కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని అన్నారు.

**- కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంను విజయవంతం చేయండి**

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయవంతంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రణవ్ బాబు అన్నారు. డిసెంబర్ 28 అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలతో పాటు గ్రామ స్థాయి, పట్టణ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు అన్ని ప్రధాన కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**సూర్య, హుజురాబాద్**



కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను పేద ప్రజల సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వేముల పుష్పలత అన్నారు. బుధవారం మాట్లాడుతూ పేద ప్రజలు ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాల కోసం ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేద ప్రజల పక్షాన ఉంటుందని ఆమె అన్నారు.

## విద్యార్థిని సన్మానించిన సర్పంచ్ వెంకట రమణారెడ్డి

**సూర్య, శంకరపట్నం**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ లో నిర్వహించిన 67 వ పాఠశాల స్థాయి క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాపూర్ లో అండర్ - 17 విభాగంలో జరిగిన టైక్వాండ్ పోటీలలో రాష్ట్రస్థాయి లో రెండవ స్థానాన్ని సాధించిన పదవ తరగతి విద్యార్థిని యండి. యాస్మిన్ ను గ్రామ సర్పంచ్ కాటం వెంకట రమణారెడ్డి శాలువాతో ఘనంగా బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుజ్జుల జీవన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తోట హరి కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో చిన్నారి కీషిక మృతి

**సూర్య, శంకరపట్నం**



జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే ... ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన బోడ మధు అయిదేళ్ల కిందట హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామానికి వచ్చి ఇంటి నిర్మాణ కూలీ పనులకు వెళ్లి జీవనోపాధి గడుపుకుంటూ ఉండేవాడు. మధు ఇటీవల అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించారు. మంగళవారం హుజూరాబాద్ లోని అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్ష విరమించి అక్కడి నుంచి సింగాపూర్ గ్రామానికి చేరుకున్నాడు. కొత్తగట్టులో మేస్త్రీ వద్ద కూలీ డబ్బులు తీసుకొని మధు తన భార్య శాంతి, బిడ్డ కీషికలతో కలిసి ద్విచక్ర వాహనంపై కేశవపట్నం బయలుదేరాడు. మార్గమధ్యంలో గొల్లపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న జీపు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఏడాది వయసుగల కీషికకు తీవ్ర గాయాలు కాగా మధు, శాంతిలు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. కీషిక పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది చిన్నారి కీషిక.

**జన్మదిన వేడుక జరిగిన 17 రోజులకే...**

ద్విచక్ర వాహనం పై వెళ్తున్న కీషిక రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. కాగా కీషిక మొదటి జన్మదిన వేడుకలు ఈ నెల 9న జరిగాయి. 17 రోజులకే చిన్నారి మృత్యువాత పడటం కుటుంబంలో విషాదం నింపింది.

## వైభవంగా శ్రీ గుంటి పెరుమాండ్ల జాతర మహోత్సవం

**సూర్య, కోరుట్ల టౌన్**



కోరుట్ల పట్టణ విలీన గ్రామమైన యకీన్పూర్ గ్రామ కోరుట్ల శివారులోని శ్రీ గుంటి పెరుమాళ్ళ జాతర మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అనంతరం రథోత్సవం ఆలయం చుట్టూ తిప్పడం ఇక్కడ అనేక ఏళ్ళ నుండి అనవాయితీగా వస్తుంది. ఈ రథం పై నుండి విసిరిన లడ్డు దొరికిన పిల్లలు లేని వారికి పిల్లలు అవుతారని నమ్మకం ఆనవాయితీగా వస్తుంది ఇట్టి లడ్డును రథం పై నుండి పంతుల్లు విసరగా అందుకోవడానికి పిల్లలు లేని దంపతులు పోటీ పడతారు. ఈ కార్యక్రమంలో చింత సురేష్ కుమార్ రాధిక, ప్రసాద్ పద్మజ, పితాంబర్ లలిత, శంకర్ శర్మ,, చింత సునీల్ చింత ఉదయ రూప, తిరుక్కోవేల ప్రవీణ్ సంధ్యా రూప, ఆదిశేషు, శ్రీ చరణ్, ఫణీంద్ర శర్మ, కృష్ణ, జయనంద్, కుమార్ యకీన్పూర్ కోరుట్ల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాన్సన్, కోరా విద్యార్థిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



జాన్సన్ గ్లోబల్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కుమారి అక్షరాకు భారత్ ఆర్ట్ అండ్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించినటువంటి కూచిపూడి క్లాసికల్ డాన్స్ లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డును భారత అకాడమీ వారు అక్షరకు బహుకరించడం జరిగినది. దీనిలో భాగంగా పాఠశాల డైరెక్టర్స్ అయినటువంటి మహిపాల్ రెడ్డి, వర ప్రసాద్, హరికృష్ణ స్వామి, రామిరెడ్డి, సంతోష్ రెడ్డి విద్యార్థిని ప్రశంసింపజేశారు. హరికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి నైపుణ్యం గల విద్యార్థులను వెలికి తీయడమే మా పాఠశాల యొక్క ప్రత్యేకత అని తెలియజేశారు. తదుపరి విద్యార్థి తల్లిదండ్రులను శాలువా తో సత్కరించడం జరిగింది.

## ప్రయాణీకులకు బస్సుల అందుబాటు విషయమై ఆరా తీసిన రీజనల్ మేనేజర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



మహాలక్ష్మి పథకము అమలు దృష్ట్యా ప్రయాణీకులకు బస్సుల అందుబాటు విషయమై కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎన్. సుచరిత డా. బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్,కరీంనగర్ బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి. రజినీ కృష్ణ, బస్ స్టేషన్ సూపర్వైజర్ నాగమణిని ఆరా తీపారు. ప్రయాణీకులకు సరిపడ బస్సులు ఏర్పాటు చేసి అన్ని రూట్లలో ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యము కలగకుండా చూడాలని సూచించారు.

## నేటినుండి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ

**- ఒక ఇంటి నుండి ఒకటే దరఖాస్తు..**

**- జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



రాష్ట్ర ప్రభుత్వ "ఆరు గ్యారెంటీలు" పథకాల అమలు కు నేటి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష తెలిపారు. డిసెంబర్ 28 నుండి జనవరి ఆరవ తేదీ వరకు జిల్లాలోని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీల అన్ని వార్డులలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ పథకం కింద మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, గృహ జ్యోతి, చేయూత పథకాలకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఒక ఇంటి నుండి ఒకటే దరఖాస్తులో పూర్తి వివరాలను అందించి దరఖాస్తు చేసుకోవాలని, మహిళలకు దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తు స్వీకరిస్తామని అర్హులైన ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తులు స్వీకరించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. దీనికోసం గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డు ల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామని ఎవరు కూడా ఆందోళన చెందే అవసరం లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు.

# డబుల్ బెడ్ రూమ్ అర్హులకు ఇందిరమ్మ పథకంలో ప్రాధాన్యత నివ్వాలి

## - జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



టిఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులుగా గుర్తించి ఇండ్లు రానివారికి ఇందిరమ్మ పథకంలో ప్రాధాన్యత నివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మూశం రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో అనేకమార్లు సర్వేలు నిర్వహించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించారన్నారు. అయితే అందులో డ్రా పద్ధతిలో కేవలం 1800 మందికి మాత్రమే ఇల్లను కేటాయించారని, మిగిలిన వారికి ఇళ్లను మంజూరు చేయలేదన్నారు. ఇల్లు రాని అర్హులకు గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటి స్థలం తో పాటు మూడు లక్షల రూపాయలను అందించేందుకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎలక్షన్లకు ముందు కొంతమందికి పట్టాలు కూడా అందజేశారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తులు స్వీకరించనున్న నేపథ్యంలో గతంలో అర్హులుగా గుర్తించిన వారికి ప్రాధాన్యత నివ్వాలని మూశం రమేష్ డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఇందిరమ్మ పథకానికి అర్హులుగా గుర్తించబడి ఇల్లు రాక నిరుపేదలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, ఇప్పుడు మళ్లీ మొదటి నుండి దరఖాస్తులు స్వీకరిస్తే గతంలో అర్హులుగా గుర్తించిన వారు తీవ్ర అన్యాయానికి గురవుతారని ఆయన వాపోయారు. సిఐటియు నాయకులు కోడం రమణ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అనేక అవకతవకలు జరగాయని ఆరోపించారు. అవకతవకలపై అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని, అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి అర్హులకు అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై విచారణ జరిపించి అనర్హులను తొలగించి అర్హులకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారికి సిపిఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎనమగంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, బెజగం సురేష్, గోవిందు లక్ష్మణ్ ,మోర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



### ఓమౌజయా ఆధ్వర్యంలో స్పిరిట్ అఫ్ ది యూత్ ర్యాలి

**సూర్య సిరిసిల్ల టౌన్**

రాజన్న సిరిసిల్ల లో ఇంటర్నేషనల్ ఓమౌజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఐఏయూవైఎస్ఏ ఆధ్వర్యంలో స్పిరిట్ అఫ్ ది యూత్ ర్యాలీనీ నిర్వహించారు. మన భారత దేశం లో అత్యధిక జనాభా యువత ఉన్నారని, యువతలో శాస్త్రీయపరమైన దృక్పథం ఏర్పడితేనే రేపటి తరం అద్భుతంగా ఉంటుందని ప్రముఖ వ్యక్తిత్వం వికాస నిపుణులు,ఐఏయూవైఎస్ఏ వ్యవస్థాపకులు మాస్టర్ ఎస్.పి.మ్యాస్ట్రో వారు చూపిన మార్గం అందరికి ఉపయోగకరమని ఐఏయూవైఎస్ఏ అధ్యక్షులు తిరుమల ఋషి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల పట్టణంలో పెద్ద ఎత్తున బతుకమ్మ ఘాట్ నుంచి కొత్త బస్టాండ్ వరకు యువకులు పాల్గొన్నారు. ర్యాలీలో యువకులు రేపటి తరం అభివృద్ధి శాస్త్రీయ పరమైన యువతకు సొంతమని నినాదాలు చేస్తూ, భారతీయులుగా అందరం ఒక్కటిగా ఉండాలి అంటూ విశ్వ శ్రేయస్సు కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిదని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏయూవైఎస్ఏ కోర్ టీం సభ్యులు, ఐఏయూవైఎస్ఏ జేమ్స్ పాల్గొన్నారు.

### చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించమే లక్ష్యం

**-వేములవాడ సబ్ కోర్టు న్యాయమూర్తి రవీంధర్**

**సూర్య రుద్రంగి**

చట్టాలపై ప్రతి ఒక్కకి అవగాహన కల్పించమే లక్ష్యమని వేములవాడ సబ్ కోర్టు న్యాయమూర్తి సత్తు రవీంధర్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రుద్రంగి మండలం మానాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సత్తు రవీందర్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నా రు. విద్యార్థి దశ నుండే చట్టాలను తెలుసుకోవాలన్నా రు.భారత రాజ్యాగం చట్టాలకు మూలమని ర్యాజాంగం ద్వారా మహిళలకు అనేక హక్కులు కల్పించారని తెలిపారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే అవసరమైన సందర్భంలో అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. న్యాయ సేవాధికర సంస్థ ద్వారా కూడా ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సుచిరిత, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, గంగరాజు, రాజూరి రమేష్. డిహబ్ కార్యదర్శి త్రివేణి, సఖీ లీగల్ ప్రతినిధి అంజలి, లోక్ అదాలత్ సభ్యులు రామరాజు, లీగల్ ఎయిడ్ ప్రతినిధి శ్రీనివాస్ తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### మిషన్ భగీరథ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**సూర్య సిరిసిల్ల టౌన్**



రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మిషన్ భగీరథ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు రావలసినటువంటి బకాయిలు చెల్లించాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,మిషన్ భగీరథ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.వారు ఎన్నో సంవత్సరాల నుండి ప్రజలకు మంచి నీటి సరఫరాలో సేవలు చేస్తున్నారని వారి సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని అన్నారు.మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం 26,000 ప్రమాద బీమా సౌకర్యం,సంవత్సరానికి రెండు జతల యూనిఫాం,నైటు డ్యూటీ చేస్తున్న సందర్భంలో టార్చిలైట్లు ఇవ్వాలని కోరారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో మిషన్ భగీరథ కార్మికులను గుర్తించలేదనీ,కనీస వేతనాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిషన్ రాజు,నాయకులు తిరుపతి,నరేష్ పాల్గొన్నారు

### నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు పోరాట యోధుడు బద్ధం ఎల్లారెడ్డి.

**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి.**

**సూర్య. ఇల్లంతకుంట**



నిజం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు పోరాట యోధుడు బద్ధం ఎల్లారెడ్డి అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గాలిపల్లిలో బద్ధం ఎల్లారెడ్డి 45వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి బానిసత్వానికి తిరుగుబాటు చేసిన ఘనత బద్ధం ఎల్లారెడ్డేనని, ప్రజల కోసం పరితపించే నాయకుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధివిధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ చైతన్య వంతులను చేసేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్యదర్శి గుంటి వేణు,నాయకులు మంద సుదర్శన్,రాజు,మల్లేశం, గ్రామస్థులు కరుణాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లయ్య,రవీందర్, శ్రీనివాస్ రెడ్డి,మల్లారెడ్డి, శ్రీకాంత్ తదితరులు వున్నారు.

### నేడు ఇల్లంతకుంట మండల సభ

**సూర్య. ఇల్లంతకుంట.**

నేడు గురువారం ఇలంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి ఉట్కూరి వెంకటరమణారెడ్డి తెలిపారు.మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వ%శీ%పెల్లి సత్యనారాయణ హాజరవుతున్నట్లు, ఎంపిటిసి సభ్యులు,సర్పంచులు,అధికారులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.






### మెగా పశు వైద్య శిబిరం

**సూర్య బోయినపల్లి**

బోయినిపల్లి పాల ఉత్పత్తి దారుల సంస్థ బోయినపల్లి లో పాలు పోసే పాల ఉత్పత్తిదారుల పశువులకు బోయినిపల్లి మండల కేంద్రంలోని మండల పశు వైద్యశాలలో బూరుగుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దగ్గర పశువులకు వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో పాలు ఉత్పత్తి దారుల సంస్థ బోయినిపల్లి అధ్యక్షులు ధ్యావ మల్లారెడ్డి, మండల పశు వైద్య అధికారి రమేష్, కరీంనగర్ డెయిరీ డి.డి రిటైర్ ప్రేమ్ కుమార్, బోయినిపల్లి పాల ఉత్పత్తి దారుల సంస్థ కార్యదర్శి మెరుపుల గంగాధర్ గౌడ్,వీఏ లు నరేష్, అనిల్, డైరెక్టర్లు ఎడపల్లి లచ్చయ్య ,గంగిపల్లి మొండయ్య, సంబ కనకవ్వ , నలిమెల నారాయణ ,నేరెళ్ల బాలయ్య, నిమ్మ గోపాల్ రెడ్డి డెయిరీ రైతులు బోయిని బిక్షపతి, పరుశు రాములు.గుంటి కొమురయ్య, గొడుగు మల్లేశం ,బరిగ రమేష్, పెరుక మోహన్ , అధికం చంద్రయ్య , పిట్టల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆది శ్రీనివాస్ ను కలిసిన సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు

**సూర్య రాజన్న సిరిసిల్ల**



వేములవాడ శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసును సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వేములవాడ లోని ఆది శ్రీనివాస్ స్వగృహంలో సిరిసిల్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు గోలి వెంకటరమణ,యెల్లే లక్ష్మీనారాయణలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ను శాలువాతో సత్కరించారు.

### నేడు ఎమ్మెల్యే "కవ్వంపల్లి" రాక.

**సూర్య. ఇల్లంతకుంట**

నేడు గురువారం మండలానికి మానకొండూరు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి బుధవారం ప్రకటన లో తెలిపారు. ఉదయం 8 గంటలకు కేశన్నపల్లే గ్రామం లోని బతుకమ్మ తెప్ప వద్దనుండి ర్యాలీ గా వస్తూ, ముస్కానిపేట గ్రామ పంచాయితీ అవరణలో ప్రభుత్వం నిర్వహించే గ్రామసభ లో పాల్గొని, ఇక్కడ నుండీ ఇల్లంతకుంట బస్టాండ్ వరకు ర్యాలీ వుంటుందని, ఆనంతరం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ పతకాన్ని ఆవిష్కరించనున్నట్లు, వైశ్య భవనం లో ప్రజాప్రతినిధుల, పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశానికి హాజరవుతారని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ప్రతిభకు పేదరికం అడ్డు కాదు

**సూర్య సిరిసిల్ల టౌన్**

సిరిసిల్ల పట్టణంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో 2019 విద్యా సంవత్సరంలో కళాశాలలో బైపిసి చదివిన జిల్లెల్ల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థిని కుమారి బర్ల అఖిల కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్త పరుస్తూ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి,ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీ.వనజ కుమారి మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కాదని,ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించే క్రమంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంతో వాటిని ఎదిరించిన వారికి విజయం తప్పకుండా వరిస్తుందని దీనికి ప్రత్యక్ష నిదర్శనం కుమారి బర్ల అఖిల అని అన్నారు.విద్యార్థినిల%శీ%ద రూ తన విజయాన్ని ఆదర్శంగా తీసుకొని ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇష్టపడి చదివి మంచి ఉద్యోగాన్ని సంపాదించి తల్లి దండ్రులకు గురువులకు,సమాజానికి మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్, ఆఫీస్ సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

# నేటి నుంచి గ్రామసభలు..

**- ఆరు గ్యారంటీలపై కోటి ఆశలు.!! - నెరవేరనున్న నిరుపేదల సొంతింటి కల - రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీని జతపరచాలి**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభించనుంది. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన 6 గ్యారంటీల అమలు లక్ష్యంగా కార్యాచరణకు ప్రణాళిక రూపొందించింది. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు క్షేత్రస్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి వార్డు స్థాయిలో ధ్రువీకరణ పత్రాలను స్వీకరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేసింది. అందుకుగాను మండల స్థాయిలో అధికార బృందాలను నియమించింది. జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయనుంది. దరఖాస్తు ఫారం లను ముద్రించి లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఎప్పటికప్పుడు రోజువారీగా దరఖాస్తులను స్వీకరించి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయనున్నారు. గ్రామసభల నిర్వహ ణపై అధికారులకు ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు.

**పెద్దపల్లి జిల్లాలో 226 గ్రామపంచాయతీలు, 4 పురపాలక సంఘాలు.**

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామపంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాలు ఉండగా సుమారు 43 అధికార బృందాలను ఏర్పాటు చేశారు. 380 గ్రామసభలను నిర్వహించ ్నున్నా రు. 1880 కౌంటర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 7,96,332 జనాభా ఉన్నారు. వీరిలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

**ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్.**

జిల్లాలో 266 గ్రామపంచాయతీలతో పాటు పెద్దపల్లి, మంథని, రామగుండం, సుల్తానాబాద్ పురపాలిక ప్రాంతాలు ఉన్నాయి. గ్రామాల్లో 1230 వార్డులు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 116 మున్సిపాలిటీ వార్డులు ఉన్నాయి. ప్రతి మండలానికి ఏర్పాటు చేసిన కమిటీలో ఎంపీడీవో, తాహాసిల్దార్, ఏవో లేక మునిసిపల్ కమిషనర్ ల పర్యవేక్షణలో బృందాలు సభలో




పాల్గొంటాయి. ప్రతి బృందంలో మండల, గ్రామస్థాయి అధికారులు, సెర్ప్ సిబ్బందిని జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసే కౌంటర్లలో ఉంచారు.ప్రతి బృందం రోజుకు రెండు చోట్ల సభల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు.

**ఐదు పథకాల అమలుపై దృష్టి.**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీల అమలుపై దృష్టి సారించింది. ఇప్పటికే హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు రవాణా వసతి కల్పించింది. అదేవిధంగా చేయూత పథకంలో భాగంగా ఆరోగ్యశ్రీ వైద్యాన్ని రూ 10 లక్షల వరకు పెంచి నమ్మకాన్ని కలిగించింది. వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ప్రజలు వాటిపై కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా గతంలో ఎన్నడు లేని విధంగా కౌలు రైతులకు రైతు బంధు, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ 12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని హామీపై ఆసక్తి రేకెత్తిస్తుంది. మిగిలిన యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు భరోసా ,గృహజ్యోతి పథకాలకు సంబంధించి గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. రోజువారీగా ఐదు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేస్తారు. రేషన్ కార్డుల మంజూరు, ధరణి రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. వీటికి దరఖాస్తులు తీసుకొని ఆన్లైన్ లో నమోదు చేసి సంబంధించిన ఆయా శాఖలకు దరఖాస్తులను పంపనున్నారు.

**ఆన్ లైన్ లో దరఖాస్తుల నమోదు.**

గ్రామ సభలను సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా అధికారుల సమన్వయం తీసుకుంటున్నారు. నియోజకవర్గస్థాయిలో గ్రామసభల పర్యవేక్షణ, దరఖాస్తుల విశ్లేషణ అంశాలను ఆర్డీవోలు, జెడ్పిసిఈఓ, మున్సిపల్ కమిషనర్లు చూస్తారు. ఐదు గ్యారంటీ సంక్షేమ పథకాల కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ లను జత చేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డు లేని వారు ఫారంలో కార్డు లేదని నమోదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. సంక్షేమ పథకాల మంజూరులో తెల్ల రేషన్ కార్డు ను ఆధారంగా తీసుకొనున్నారు. ఈ విధంగా గ్రామ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను రోజువారీగా ఆన్లైన్లో నమోదు చేయనున్నారు.

**కొత్త పథకాలపై కోటి ఆశలు.**

ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలుపై నిరుపేదలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా నిరుపేదలకు అత్యవసరమైన సొంతింటి కలతో పాటు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, కౌలు రైతులకు ఆర్థికసాయంపై కొండంత ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం మారడం కొత్త ప్రభుత్వం కొలువుదీరడం నిరుపేద ప్రజలు సంక్షేమ పథకాల పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ప్రజలు వాటి పై ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ తాజాగా కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.5 లక్షలు మంజూరు చేయనుంది. దీంతో ఇండ్లు లేని వేలాది మంది నిరుపేదలు ఈ పథకంపై ఎంతో అశగా ఉన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేస్తే నిరుపేదల జీవితాల్లో కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## దత్తాత్రేయ స్వామి వారికి 365 రోజులు నిత్య పూజలు జరిగేలా చర్యలు తీసుకుంటాము

**- మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**సూర్య బోయినపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం వరదవెల్లి గ్రామంలో స్వయంభూగా వెలిసిన దత్తాత్రేయ స్వామివారి 43వ జయంతి సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ మొదటిసారిగా స్వామివారిని దర్శించుకున్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , కవ్వంపల్లి సత్యనారాయణ లను ఆలయ సాంప్రదాయ ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు దత్తాత్రేయ ఆలయ కమిటీ. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సత్వరమే పరిష్కారం చేస్తామన్నారు. దత్తాత్రేయ అలయంకు నిరంతరం పూజలు జరిగేలా చర్యలు తీసుకుంటామని మిడ్ మానేరు డ్యాం మధ్యలో ఉన్న దత్తాత్రేయ ఆలయం వెళ్ళడానికి నిరంతరంగా బొట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు మేము అధికారంలోకి వచ్చి 21 రోజులే అవుతున్నాయి. దత్తాత్రేయ స్వామి దయతో ఎన్నికల వేల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి వారికి 365 రోజులు నిత్య పూజలు జరిగేలా చర్యలు తీసుకుంటామని భక్తులు కోరిన విధంగా ఒక బోట్ ను ఏర్పాటు చేసేందుకు మంత్రి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. భవిష్యత్తులో దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని ఒక దివ్య క్షేత్రంగా ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కుస రవీందర్, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, జిల్లా మండల నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సన్నాహక సమావేశంలో పాల్గొన్న జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కరీంనగర్ కలెక్టరెట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలన సన్నాహక సమావేశం లో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు లను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొని ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే వివిధ అంశాలపై చర్చించారు.



## వేములవాడలో నత్తనడకన కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణాలు

- తీవ్ర దుర్గంధంతో దోమలతో రోగాల బారిన పడుతున్న ప్రజలు
- రెండు నెలలు గడుస్తున్న పూర్తికాని డ్రైనేజీ నిర్మాణ పనులు
- డ్రైనేజీ పైకప్పు వేయడానికి పైసలు వసూలు



**సూర్య వేములవాడ టౌన్**

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ రోడ్డులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. డ్రైనేజీ నిర్మాణం పూర్తయినా పై కప్పులు



వేయకపోవడంతో చెత్త చెదారం పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతు దోమలతో షాప్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. సదరు కాంట్రాక్టర్ డ్రైనేజీ పైకప్పు వేయడానికి పరటా చెక్కలు వేయాలని, ఆ చెక్కలు షాప్ యజమానులు కొనుగోలు చేసుకోవాలంటూ ఒక్కొక్కరి వద్ద 1500,1600 చొప్పున రూపాయలు



వసూలు చేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ చెత్త చేదారాలు తీయకుండానే పై కప్పు వేయడంపై మున్సిపల్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూన్నారు. డ్రైనేజీ పై కప్పు వేయడానికి వేసిన సామాగ్రిని మున్సిపల్ అధికారులు మున్సిపల్ వాహనములో మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. డబ్బులిస్తేనే ఇప్పుడు పై కప్పు వేస్తామని.. ఇవ్వని వారు మేము వేసే వరకు ఆగల్సిందేనని కాంట్రాక్టర్ అనడం కొసమెరుపు.

# నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపికి అధికంగా ఓట్లు

**- ఎంపీ అరవింద్**

**సూర్య జగిత్యాల**

రాష్ట్రంలో ఏ పార్లమెంటు నియోజకవర్గం లో రాని విధంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపికి అధికంగా ఓట్లు వచ్చాయని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. భారతీయ జనతా పార్టీ సారంగాపూర్ బీర్పూర్ మండల ముఖ్య నాయకులు విస్తృత సాయి సమావేశాల్లో సారంగాపూర్ లో బుధవారం బిజెపి రాష్ట్ర



కార్యవర్గ సభ్యురాలు డా.బోగ శ్రావణి తో కలిసి పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఇద్దరు అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారన్నారు. బిజెపి మిగతా పార్లమెంటు స్థానాల్లో ఎందుకు బలహీనపడింది గమనించాలి డిపాజిట్లు కూడా రాలేదు అన్నారు. గతంలో బిఆర్ఎస్ నాయకులు రామ మందిరం పై బిజెపి ఓట్లు అడుగుతుందని విమర్శించిన నాయకులు ఇప్పుడు హిందుత్వం పై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఎట్లా అమలు చేస్తారో ప్రజలకు తెలిపాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ పార్లమెంటు పని తీరుపై అమిత్ షా సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పైడిపల్లి



సత్యనారాయణ రావు, బీర్పూర్ మండల అధ్యక్షులు మ్యాన జనార్ధన్, సారంగాపూర్ మండల అధ్యక్షులు ఎండబట్ల వరుణ్ కుమార్, రైతు నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్,జిల్లా యువ మోర్చా అధ్యక్షులు రేంటం జగదీష్, జిల్లా, మండల పదాధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కౌన్సిల్ సభ్యుల సహకారంతో అభివృద్ధి

**సూర్య,కోరుట్ల టౌన్**

కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం బుధవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో ఉండి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 30 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి రాజేశ్వర్, డిఈ అభినయ్,ఏఈ లక్ష్మి,టిపిఓ ప్రవీణ్ టీపీఎస్ రమ్య,మేనేజర్ శ్రీనివాస్,సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్,వార్డు కౌన్సిలర్లు కో ఆప్షన్ మెంబర్లు సిబ్బంది పాల్గొన్నారు.




# 48 గంటల్లో దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

**- కేశవపట్నం పోలీసులను అభినందించిన ఏసిపి**

**సూర్య, శంకరపట్నం**

సంఘటన జరిగిన 48 గంటల్లో నిందితులను పట్టుకొని శంకరపట్నం పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకెళ్తే..... శంకరపట్నం మండల పరిధిలోని కాచాపూర్ గ్రామంలో ఈనెల 24న తాళం వేసి ఉన్న తరిగొప్పుల రాములు ఇంట్లో దొంగ చొరబడి మూడు లక్షల రూపాయల నగదు అపహరించుకుపోయారు. తరిగొప్పుల రాములు కొన్నాళ్ల క్రితం బతుకు తెరువు కోసం నల్లగొండ జిల్లా నుంచి శంకరపట్నం మండలం కాచాపూర్ కి వచ్చాడు. నల్లగొండలోని తన వ్యవసాయ భూమిని అమ్ముకోగా వచ్చిన డబ్బుని ఇంట్లో పెట్టుకుని దానిలోంచి కొంత మొత్తం అప్పు కట్టడానికి ఇంటికి తాళం వేసి ఆ తాళం చెవి గూటిలో పెట్టి వెళ్లారు. అటుగా తిరుగుతున్న ఓ యువకుడు గమనించి గూటిలోని తాళం చెవి తీసుకొని బీరువాను తెరిచి ఒక ఫోను, మూడు లక్షల నగదు రూపాయలు దొంగలించి తిరిగి ఇంటికి తాళం వేసి ఆ గూటిలో తాళం చెవి పెట్టి వెళ్ళాడు. ఇంటికి వచ్చిన యజమాని దొంగతనం జరిగిందని గమనించి కేశవపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రాములు ఫిర్యాదు మేరకు కేశవపట్నం పోలీసులు హుజురాబాద్ రూరల్ సిఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డి లు ఘటన స్థలాన్ని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్లతో పరిశీలించి హుజురాబాద్ రూరల్ సీఐ బి. సంతోష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ రాంబాబులు దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా సీసీ కెమెరాల ద్వారా 48 గంటల్లో కేసును చేదించి, రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి జంపయ్య (29) దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించి పట్టుకుని దొంగలించబడిన మూడు లక్షల రూపాయలకు గాను రెండు లక్షల రూపాయల నగదు, సెల్ ఫోన్ స్వాధీన పరుచుకొని రిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రత్యేక శ్రద్ధ వహించి 48 గంటల్లోనే కేసును చేదించి, దొంగని పట్టుకొని నగదు స్వాధీన పరుచుకున్న కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ రాంబాబులను హుజురాబాద్ ఏసిపి జీవన్ రెడ్డి బుధవారం అభినందించారు.

# నేడు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

**సూర్య, వీణవంక**

నేడు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో వీణవంకలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించబడునని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీణవంక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యామ్ సుందర్ రెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ అభిమానులు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

# జిల్లా యువజనోత్సవాలను విజయవంతం చేయాలి

**సూర్య,రాయికల్**



జగిత్యాల జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఈనెల 29న ఎస్.కె.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ధర్మపురి రోడ్డులో నిర్వహిస్తున్నట్లు రాయికల్ మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు గంగాధరి సురేష్ తెలిపారు.జిల్లా యువజన,క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవికుమార్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాకు సంబంధించిన కళాకారులు జానపద నృత్యం, జానపద పాటలు,గ్రూప్,సోలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని,దీంతోపాటు లైఫ్ స్కిల్ కాంపోనెంట్ (కథ రచన,పోస్టర్ మేకింగ్,భావ ప్రకటన,ఫోటోగ్రఫీ) పోటీలను నిర్వహించి,ప్రతి అంశంలోని విజేతలను ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.ఎంపికైన కళాకారులను జనవరి 6న హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతునట్లు ఆయన తెలియచేశారు.పోటీల్లో పాల్గొనే యువతి యువకుల వయస్సు 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలని,పోటీలలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామాగ్రిని కళాకారులు తమ వెంట తీసుకురావాలని సూచించారు.అధిక సమాచారం కోసం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ కార్యాలయముకు లేదా 9704061725 కి సంప్రదించగలరాని కోరారు.

# విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేదిపుస్తకమే

**- ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నారాయణ**

**సూర్య చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి లింగంపల్లి గంగరాజు రెండవ తరగతి, మూడో తరగతి విద్యార్థులకు గణిత బోధిని పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ సమక్షంలో స్వచ్చందంగా స్వయంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "గణితం నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి కి ఒక భాగమని,గణితం నిత్యజీవితంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, గణిత భావనలు, సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, విద్యార్థులు జీవితాల్లో వెలుగు నింపేది పుస్తకమేనని, పూర్వ విద్యార్థి లింగంపల్లి గంగరాజు ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పూర్వ విద్యార్థి పాఠశాల ప్రగతికి తమ వంతు సహకారాన్ని అందించాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని " పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి గంగరాజు మరియు ఉపాధ్యాయులు నరేష్ ,ముఖేష్, రవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు .





# రెండవ విడత దళిత బంధు మంజూరు చేయాలి

**సూర్య జమ్మికుంట**

దళిత బంధు రెండవ విడుత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు బైఠాయించారు ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ బీ ఆర్ ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ప్రవేశపెట్టిందన్నారు. మొదటి విడత లబ్ధి పొంది దుకాణ సముదాయాలు నెలకొల్పామని తెలిపారు. రెండో విడత కోసం సర్వే చేశారని, అనంతరం శాసనసభ ఎన్నికల కోడు అమల్లోకి రాగానే తాత్కాలిక%శీ%గా నిలిపివేశారని అన్నారు. ఎన్నికల నియమావళి ముగిసింది కాని ఇంతవరకు రెండవ విడత పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ%శీ% మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే దళిత బంధు రెండోవ విడత అమలు చేసి దళితులను ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ధర్నాలు ,రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

# నేటి నుండే ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ.

**- నేటి నుండి జనవరి 6 వరకు తీసుకొనున్న దరఖాస్తులు.**

**- ఒకే దరఖాస్తు తో అభయ హస్తం గ్యారెంటీల అమలుకు స్వీకారం.**

**సూర్య, ఇల్లందకుంట**




పట్టణాలను మొదలుకొని మారుమూల పల్లెల వరకు సంక్షేమ పథకాలు అందాలి అనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఒకే దరఖాస్తు తో అభయహస్తం గ్యారంటీలను అమలు చేయనున్నదని, గత పదేళ్ల ప్రభుత్వం ప్రజలకు ఎంత దూరంగా ఉంది అనేది ప్రజావాణి చూస్తే అర్థమవుతుందని ప్రజావాణిలో వచ్చిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని దీనికై ప్రజలు హైదరాబాద్ వరకు వచ్చి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వమే ప్రజల దగ్గరకు పోవాలి అని ఈ నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఇందులో భాగంగా ఇల్లందకుంట మండలంలో 28న బూజునూరు, భోగంపాడు ఇల్లందకుంట లలో, 29న చిన్న కోమటిపల్లి, గడ్డివానిపల్లి, కనగర్తి, లక్ష్మాజి పల్లె లలో, 30న మల్లన్న పల్లి మల్యాల మర్రివానిపల్లి పాతర్లపల్లిలలో, జనవరి 2న రాచపల్లి, సీతంపేట, సిరిసిడు శ్రీరాములపల్లి లలో, 3న టేకుర్తి, వంతడుపుల, వాగోడ్డు రామన్న పల్లెల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సింగరేణి ఎన్నికల్లో 95 శాతం పోలింగ్ నమోదు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ లో గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. సింగరేణి వ్యాప్తంగా 39805 మంది ఉద్యోగులు ఉండగా 37451 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోగా 95 శాతం పోలింగ్ నమోదు అయింది. ఆర్జీ–1 డివిజన్ లో 5384 మంది ఉద్యోగులకు 5044 మంది ఓటు వేయగా 93.70 శాతం నమోదు, ఆర్జీ–2 డివిజన్ లో 3556 మంది ఉద్యోగులకు 3369 మంది ఓటు వేయగా 94.74 శాతం నమోదు, ఆర్జీ–3 డివిజన్ లో 3884 మంది ఉద్యోగులకు 3612 మంది ఓటు వేయగా 93.00 శాతం నమోదు, భూపాలపల్లి డివిజన్ లో 5442 మంది ఉద్యోగులకు 5123 మంది ఓటు వేయగా 94.13 శాతం నమోదు, బెల్లంపల్లి డివిజన్ లో 996 మంది ఉద్యోగులకు 959 మంది ఓటు వేయగా 96.30 శాతం నమోదు, మందమర్రి డివిజన్ లో 4835 మంది ఉద్యోగులకు 4515 మంది ఓటు వేయగా 93.40 శాతం నమోదు, శ్రీరాంపూర్ డివిజన్ లో 9127 మంది ఉద్యోగులకు 8491 మంది ఓటు వేయగా 93 శాతం నమోదు, కొత్తగూడెం డివిజన్ లో 2326 మంది ఉద్యోగులకు 2207 మంది ఓటు వేయగా 94.88 శాతం నమోదు, ఎల్లందు డివిజన్ లో 614 మంది ఉద్యోగులకు 604 మంది ఓటు వేయగా 98.37 శాతం నమోదు, మణుగూరు డివిజన్ లో 2450 మంది ఉద్యోగులకు 2378 మంది ఓటు వేయగా 97.06 శాతం నమోదు, కార్పొరేట్ ఏరియా లో 1191 మంది ఉద్యోగులకు 1149 మంది ఓటు వేయగా 96.47 శాతం నమోదు అయింది. ఈ ఎన్నికల్లో 13 సంఘాలు అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి), తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్), సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్టీయూసీ), సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్), సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్( హెచ్ఎంఎస్), సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు), సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టిఎన్టియూసీ), గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం, సింగరేణి గని కార్మిక సంఘం, తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం,తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం, సింగరేణి డ్రైవర్స్ ఈపి ఆపరేటర్ అండ్ అండర్ గ్రౌండ్ అల్ ట్రేడ్ వర్కర్స్ అసోసియేషన్ సంఘాలు పాల్గొన్నాయి



## ప్రజా పాలన వార్డు సభలను సద్వినియోగం చేసుకోండి

**-నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్**

**సూర్య-గోదావరిఖని:**

గ్రామసభల ద్వారా 'ప్రజా పాలన' దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ గురువారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు ఇట్టి వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఇక్కడి నగరపాలక సంస్థ కార్యాలయంలోకానున్న నేపధ్యంలో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, అంగన్ వాడీ, మెప్మా సిబ్బంది, ఆర్ పి లతో జరిగిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సభలను నిర్వహించేవారు భాద్యతాయుతంగా విధులు నిర్వర్తించి ప్రజా పాలన వార్డు సభలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన వార్డు సభల లక్ష్యాన్ని, విధి విదానాలను వారు వివరించారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు త్రాగు నీటి వసతి, కుర్చీలు, టెంట్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వార్డు సభ కు ఒక రోజు ముందుగానే ఉచితంగా దరఖాస్తు ఫారాలు అందించి సభలో పూరించిన దరఖాస్తులతో పాటుగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తీసుకొని రశీదు ఇవ్వాలని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ప్రజా పాలన స్పెషల్ ఆఫీసర్ డి .శ్రీనివాసులు, డిప్యూటీ కమిషనర్ త్రియంకేశ్వర్ రావు , ఎస్ఇ చిన్నా రావు, ఇఇ సుచరణ్, డిప్యూటీ తహశిల్దార్ విజయ్ కుమార్, మెప్మా డిఎం సి.రజనీ, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ చేసిన మద్యం షాప్

**- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

**సూర్య కోనరావుపేట**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ శివారులోగల శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్ ఉదయం 9:30 గంటలకే ఓపెన్ చేసి మద్యం విక్రయిస్తున్నారు. ఉదయము 10 గంటల ఓపెన్ చేయాలనే నిబంధనలను తుంగలోత్రొక్కి వైన్స్ యజమానులు ముందే ఓపెన్ చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుపుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎక్సైజ్ అధికారుల కనుసన్నలలోనే ఇదంతా జరుగుతుందని, ఉన్నతాధికారులు స్పందించి మద్యం షాపుల్లో సమయ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## మున్సిపల్ లో సమస్యల పరిష్కారం కోసం సమావేశం

**సూర్య, రాయికల్**

రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో నెలకొన్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు.మున్సిపల్ మోర హనుమాన్లు అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,నీటి సరఫరా,అదనపు కార్మికుల వేతనాలు వంటి సమస్యలపై సమీక్షించారు.అనంతరం 16 రకాల తీర్మానాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్ లు శ్రీధర్ రెడ్డి,కాంతారావు, మహేందర్,మహేష్ గౌడ్,అన్వర్ బేగం, సాయికుమార్,సువర్ణ,కో ఆప్షన్ సభ్యులు మహేందర్ బాబు, మేనేజర్ వెంకటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**- ఎంపీడీవో సంతోష్ కుమార్**

**సూర్య, రాయికల్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గ్రామ మండల ప్రజా ప్రతినిధులు అధికారులు విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుండి అనగా 28 నుండి జనవరి 6 వరకు రాయికల్ పట్టణంతోపాటు గ్రామాలలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజలందరినీ భాగస్వామ్యం చేసే విధంగా ప్రజాప్రతినిధులు అధికారులు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 28 నుండి జనవరి 6 వ తేదీ వరకు పట్టణంలోని వార్డులలో అలాగే గ్రామాల్లోని వివిధ కేంద్రాలలో ప్రజా పాలన దరఖాస్తులను ఉదయం 8 నుండి సాయంత్రం 6 గంటల వరకు సంబంధిత అధికారులు స్వీకరిస్తారని ప్రజలందరూ ఇట్టి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి,రైతు భరోసా,ఇందిరమ్మ ఇల్లు,గృహజ్యోతి,చేయూత పథకాలకు లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించబడుతాయని,వీటికోసం ఆయా గ్రామాలలో తేదీల వారిగా కౌంటర్లను ఏర్పాటు చేసి,అధికారులను నియమించడం జరిగినదని ఆయన తెలిపారు.ఇట్టి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ,జడ్పిటిసి,ఎంపీటీసీ సర్పంచులను ఆయన కోరారు.

## ప్రజా పాలనలో వార్డు మెంబెర్స్ కీలకపాత్ర పోషించాలి.

**-వార్డు మెంబెర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు జలంధర్ రెడ్డి**

**సూర్య, రాయికల్**



ప్రజాపాలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్లు గ్రామాలలో కీలకపాత్ర పోషించాలని జిల్లా వార్డు మెంబర్ పోరం అధ్యక్షులు ఏలేటి జలంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆరు గ్యారెంటీల అమలు ప్రజాపాలన పేరుతో అమలు చేస్తున్న పథకాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్లు కీలకపాత్ర వహించాలని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను ఆరు గ్యారంటీ లు అమలు విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుండి ప్రజాపాలన ప్రోగ్రాం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజా పాలనను సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి.

**సూర్య ఓదెల**



ఓదెల మండలం కొలనూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్పీ రాజయ్య గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల లో ప్రజల కోసం ప్రజాపాలన సదస్సును 28 తేదీ నుంచి జనవరి 6 వరకు నిర్వహిస్తున్న తరుణంలో గ్రామంలో పేరుకుపోయిన సమస్యలతో పాటు అర్హులైన పేద ప్రజలు ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాలలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ లక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు గృహ జ్యోతి చేయూత సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని, వాటితో పాటు నూతన రేషన్ కార్డులకు కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



## మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌లి

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం లోని కొండాపూర్ గ్రామానికి చెందిన గుండు లచ్చవ్వ మంగళవారం రోజున మృతి చెందగా బుధవారం రోజున అంత్యక్రియలు కార్యక్రమానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వచ్చి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి వెంట స్థానిక సర్పంచ్ సామంతుల ప్రభాకర్,ఉప సర్పంచ్ కోలాపురం రమేష్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనర్సింగా రావు,వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్,భా రా స మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, యూత్ మండల అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, నాయకులు కొత్తూరి స్వామి,చెల్ల లక్ష్మణ్,వేణు, తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం స్పాట్ లోనే వ్యక్తి మృతి

**సూర్య, మెట్ పల్లి టౌన్**

పట్టణంలోని బస్ డిపో దగ్గర గల వేంపేట్ రోడ్డు నందు బైక్ పై వస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఢీకొనడంతో స్పాట్ లోనే వ్యక్తి మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ద్విచక్ర ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని మెట్ పల్లి నుండి ఖానాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది.

